
# బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి కొత్తగట్టు మత్స్య గిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు
- 25 నుంచి ఫిబ్రవరి 8 వరకు వేడుకలు
- భక్తుల సౌకర్యార్థం పక్కా ఏర్పాట్లు
- ముస్తాబైన కొత్తగట్టు ఆలయం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని వెలిసిన కొత్తగట్టు మత్స్య గిరీంద్ర స్వామి బ్రహ్మోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఈ వేడుకలు ఫిబ్రవరి 8 వరకు కొనసాగుతాయని ఆలయ నిర్వహణ అధికారి సుధాకర్, ఆలయ చైర్మన్ కోరెం రాజిరెడ్డి, ప్రధాన అర్చకులు మురళీ ధరాచార్యులు, చిమిరాల రామకృష్ణమాచార్యులు తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, వాహన సేవలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు



పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ సూచించింది.



# నేతాజీ అడుగుజాడల్లో నడవాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం :** ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం నేతాజీ చిత్రపటానికి తహసీ ల్దార్ సురేఖ, నాయబ్ తహసీల్దార్ ఖాదర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**స్ఫూర్తిదాయకం నేతాజీ పోరాటం..**

స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన పోరాటం మరువలేనిదని, ఆయన చూపిన ధైర్యం, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తహసీల్దార్ పేర్కొన్నారు. నేటి యువత నేతాజీ అడుగుజాడల్లో నడుస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ప్రత్యూష, రాములు, వివిధ గ్రామాల పాలన అధికారులు (జీపీవోలు) కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్భయంగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. తాసిల్దార్ సురేఖ మాట్లాడుతూ.. కుల, మత, జాతి, భాషలకు అతీతంగా, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా ప్రతి ఎన్నికల్లో ఓటు వేసి తమ హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అధికారులు, కార్యాలయ సిబ్బంది,ఓటర్లతో కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్, నాయబ్ తహసిల్దార్ ఖాదర్, ఎంపీవో ప్రభాకర్, ఆర్ఐలు ప్రత్యూష, రాములు, గ్రామ పరిపాలన అధికారులు పాల్గొన్నారు



# బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా జె సంపత్ రెడ్డి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ నూతన కమిషనర్ జె సంపత్ రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో మునిసిపల్ కమిషనర్ల బదిలీలు చేపట్టారు. అందులో భాగంగా బెల్లంపల్లి కమిషనర్ తన్నీరు రమేష్ ములుగు మున్సిపాలిటీకి బదిలీ చేశారు. అక్కడ పనిచేసిన సంపత్ రెడ్డినీ బెల్లంపల్లి మున్సిపాలిటీకి బదిలీ చేశారు. నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన సంపత్ రెడ్డి ఉద్యోగులు కలసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

# భద్రత నియమాలు పాటించకపోతే ముప్పే



- ఎంవీఐ కంచి వేణు

**శెనార్తి మీడియా, హుజురాబాద్:**

"డ్రైవింగ్ అనేది వ్యక్తిగత నైపుణ్యం కాదు, ఇది సామాజిక బాధ్యత. రహదారి భద్రత నియమాలు పాటించకపోతే ప్రమాదాలు తప్పవు" అని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంచి వేణు హెచ్చరించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా శుక్రవారం జమ్మికుంట లారీ అసోసియేషన్ డ్రైవర్లకు నిర్వ హించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లకు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించామని తెలిపారు. ప్రమాదాల నివారణకు సురక్షిత డ్రైవింగ్ పద్ధతులను వివరించే పోస్టర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. రహదారి భద్రత నియమాలను సక్రమంగా పాటించడమే ప్రమాదాలను తగ్గించే ఏకైక మార్గమని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని సూచించారు. మలుపులు తిరిగే సమయంలో, వాహనం నిలిపే వేళ చేతి సంకేతాలు ఇవ్వాలని, ముందున్న వాహనం సంకేతం ఇవ్వనపుడు ఓవర్‌టేక్ చేయవద్దని అన్నారు. కదులుతున్న వాహనంపై ఎక్కడం, దిగడం చేయకూడదని తెలిపారు. రాత్రి వేళ ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు హెడ్లైట్ డిమ్ చేయాలని, ఇరుకు వంతెనల వద్ద ట్రాఫిక్‌ను గమనించి సహనంతో దాటాలని సూచించారు. తడి, ఆయిల్, ఇసుక, బురద ఉన్న రోడ్లపై వేగంగా వెళ్లడం ప్రమాదకరమని వివరించారు. రహదారి నిబంధనలు డ్రైవర్లకే కాకుండా పాదాచారులకూ వర్తిస్తాయని స్పష్టం చేశారు. పాదాచారులు జీబ్రా లైన్ వద్దనే రోడ్డును దాటాలని, నిర్ధారిత స్థలాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలని తెలిపారు. రాత్రి వేళ వాహనాన్ని నిలిపినప్పుడు పార్కింగ్ లైట్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ డ్రైవర్లు, క్లీనర్లు, రవాణా శాఖ సిబ్బంది, కానిస్టేబుల్ కత్తుల నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను శంకరపట్నం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మండలంలోని టీడీపి జెండా గద్దె వద్ద కరీంనగర్ పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యుడు మోరే ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నారా లోకేష్ పుట్టినరోజును పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అడహాక్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. యువ నాయకుడు లోకేష్ బాబు నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక కార్మికులకు పండ్లు పంపిణీ చేసి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో అడహాక్ కమిటీ సభ్యులు బైరి తిరుపతి, కోమల్‌రెడ్డి, కదిరె కొమురయ్యతో పాటు నాయకులు దసరాపు సాగర్, రాములు, వీరమల్లు, సమ్మయ్య, పార్టీ అభిమానులు కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్సులు రద్దు
- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం నస్పూర్ కలెక్టరేట్‌లో పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమీక్షలో ఆయన మాట్లాడారు. రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణించే వారు, ఓవర్ లోడింగ్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన



వారి లైసెన్సులను వెంటనే రద్దు చేయాలని, వారి వివరాలను మీడియా ద్వారా వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని, మున్సిపల్ రోడ్లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, వేగ పరిమితి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో విజిబిలిటీ పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై విక్రయాలు చేసే వ్యాపారుల కోసం ప్రత్యేక మార్కెట్ స్థలాలను గుర్తించాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలలకు తరలించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. డి.సి.పి. భాస్కర్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాలను 20 శాతం మేర తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం ఇప్పటికే 30 హాట్ స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనోజ్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి: కలెక్టర్ కుమార్ దీపక్
- విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 747 పాఠశాలల్లో చదువుతున్న 37,749 మంది విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారంతో పాటు రోజు విడిచి రోజు కోడిగుడ్డు అందించాలని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులు డిసెంబర్-2025 వరకు చెల్లించామని, పెండింగ్ బిల్లులు కూడా త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 72 శాతం మంది విద్యార్థులు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని, దీనిని వంద శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కిచెన్ గార్డెన్స్ ఏర్పాటుకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు భోజనానికి సంబంధించిన రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, నాణ్యమైన సరుకులతో వేడివేడిగా ఆహారం అందించాలని ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు తరచుగా పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులు నమోదు చేయాలని, వంటశాలల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విధులకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ముందస్తు సమాచారం లేకుండా సెలవులో ఉంటే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ యాదయ్య, డీఆర్‌డీఓ కిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వరిలో కాండం తొలిచే పురుగు నివారణపై అవగాహన

- బుధాకూర్ధ్‌లో రైతులకు రావెప్ విద్యార్థుల శిక్షణ
- ఆకుల కొనల కత్తిరింపుతో పురుగుల అదుపు
- రసాయనాల వాడకం తగ్గించేలా అవగాహన

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



మండలంలోని బుధకుర్ద్ గ్రామంలో వరి పంటను ఆశించే పసుపు కాండం తొలిచే పురుగు నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన జగిత్యాల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వరి నాటే సమయంలో మొక్కల ఆకుల చివరలను కత్తిరించే విధానంపై రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. వరి మొలకల ఆకుల కొనలను నాటే ముందు కత్తిరించడం వల్ల కాండం తొలిచే పురుగు గుడ్లు, లార్వాలు పొలంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవచ్చని విద్యార్థులు తెలిపారు. ఈ శాస్త్రీయ పద్ధతిని పాటించడం వల్ల రసాయన పురుగుమందుల వినియోగం తగ్గుతుందని, తద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని వివరించారు. భవిష్యత్తులో ఈ పద్ధతిని తప్పకుండా అమలు చేస్తామని పాల్గొన్న రైతులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రావెప్ విద్యార్థులు ఎర్మల్ రాజేశ్వర్, గజ్జెల క్రిష్ణ హరి, ఘనశ్యామ్ బఘర్, హన్స్ రాజ్, ఖాత జయంత్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

# శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా అక్షరాభ్యాసాలు

**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

కరీంనగర్ లోని శిశు మందిర్ హైస్కూల్ లో సరస్వతీ మాత పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. శంకర్ ఆర్యన్, రామస్వామిజి గార్లచే సరస్వతీ మాత పూజ, యజ్ఞం, చిన్నారులకు వేద మంత్రాల సాక్షిగా సుమారు 100 మందికి పైగా అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం బాసర అమ్మవారి కుంకుమ అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి సరస్వతీ మాత విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, సలహా సమితి సభ్యులు తణుకు మహేష్ మరియు ఇతర కమిటీ సభ్యులు, ఆచార్య బృందం పాల్గొన్నారు.

